ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
ఆదివారం 7 సెప్టెంబరు 2025



అధికార పార్టీల్లో హడావిడి!

సాధారణ ఎన్నికల్లో కష్టపడినవారికి దక్కనున్న స్థానిక సంస్థల పదవులు

భర్తీకానున్న వందలాది పోస్టులు



చిత్తూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):కూటమి పార్టీల నాయకుల్లో స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి మొదలైంది. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో పంచాయతీల్లో సర్పంచులకు.. మార్చిలో పట్టణాల్లోని నగర, పురపాలక సంస్థలకు పదవీ కాలాలు ముగియనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని మూడు నెలల ముందుగా, అంటే వచ్చే ఏడాది జనవరిలో ఈ ఎన్నికల్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే.ఈ ఎన్నికల ద్వారా పెద్దఎత్తున పదవులు భర్తీ కానుండడంతో టీడీపీ,బీజేపీ,జనసేన నాయకుల్లో స్థానిక సంస్థల పదవుల మీద ఆశలు చిగురిస్తున్నాయి.2022 ఏప్రిల్‌లో జిల్లాల విభజన తర్వాత చిత్తూరుకు 697పంచాయతీలు,6541వార్డులు మిగిలాయి. అంటే చిత్తూరు నగరపాలక సంస్థతో పాటు కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి మున్సిపాలిటీలున్నాయి. చిత్తూరులో 50 డివిజన్లు, పుంగనూరులో 31, పలమనేరులో 26, కుప్పంలో 25, నగరిలో 29 వార్డుల చొప్పున మొత్తం 161 స్థానాలున్నాయి.అంటే 697మందికి సర్పంచ్ పదవులు లభించనున్నాయి.మరో 50 మంది కార్పొరేటర్లు, 111 మంది కౌన్సిలర్లు కానున్నారు.వీరిలో నుంచి ఒకరు మేయర్, ఇద్దరు డిప్యూటీ మేయర్లుగా.. నలుగురు మున్సిపల్ ఛైర్మన్, 8 మంది మున్సిపల్ వైస్ ఛైర్మన్లుగా పదవుల్ని దక్కించుకోనున్నారు.

● రెండో పోస్టు కొనసాగించే అవకాశం

స్థానిక సంస్థల్లో అప్పటివరకు ఉన్న ఓ పోస్టును వైసీపీ ప్రభుత్వం తమ పార్టీ నాయకుల్ని సంతృప్తి పరిచేందుకు రెండుగా మార్చింది. మండలాల్లో ఓ వైస్ ఎంపీపీ, నగరపాలికల్లో ఇద్దరు డిప్యూటీ మేయర్లు, పురపాలికల్లో ఇద్దరు వైస్ ఛైర్మన్లు అదనంగా వచ్చారు. ఈ పోస్టులను కూటమి ప్రభుత్వం కూడా కొనసాగించే అవకాశాలున్నాయి. టీడీపీతో పాటు జనసేన,బీజేపీ నాయకులను సంతృప్తిపరచాలంటే రెండో పోస్టు అవసరం.

ప్రస్తుతం మెజార్టీ స్థానాలు వైసీపీ చేతిలోనే

2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలకు భారీ మెజార్టీ వచ్చింది కానీ, స్థానిక సంస్థల్లో మెజార్టీ పదవులు వైసీపీ చేతిలోనే ఉన్నాయి.చరిత్రలో ఎన్నడూలేని విధంగా వైసీపీ 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో రకరకాల అక్రమాలకు పాల్పడి ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవాలు చేసుకుంది.పుంగనూరులో ఇతర పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా వైసీపీ నాయకులు అడ్డుకుని దాడులు చేశారు. పత్రాలను చించేశారు. చిత్తూరులో పోలీసులతో ప్రత్యర్థులను బెదిరించి మరీ విత్‌డ్రా చేయించారు. కిడ్నాపులు చేసి, దొంగ సంతకాలు చేసి ప్రత్యర్థులను విత్‌డ్రా చేయించారు. ప్రశ్నించడానికి చిత్తూరు వస్తున్న అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబును తిరుపతి ఎయిర్‌పోర్టులోనే రోజంతా కూర్చోబెట్టి వెనక్కి పంపేశారు. కుప్పంలో దొంగ ఓట్లతో పాటు పెద్దఎత్తున డబ్బులు పంపిణీ చేసి మున్సిపల్ ఛైర్మన్ పోస్టును కైవసం చేసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 జడ్పీటీసీ స్థానాలుంటే అన్నీ ఏకగ్రీవమయ్యాయంటే ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో అర్థమవుతుంది.ఈ నేపథ్యంలో ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు వైసీపీ అభ్యర్థులను దీటుగా ఎదుర్కొని మెజారిటీ స్థానాలు దక్కించుకునే అవకాశాలున్నాయి.

'స్థానిక' సమరానికి ఏర్పాట్లు ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవ్వాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 1411 గ్రామ పంచాయతీల్లో 13,574 వార్డులకు 2021 ఫిబ్రవరిలో నాలుగు విడతలుగా (9, 13, 17, 21 తేదీల్లో) ఎన్నికలు జరిగాయి. కోర్టు వివాదాల కారణంగా 43 పంచాయతీల్లో, బి.కొత్తకోట మేజర్ పంచాయతీలో ఒక పంచాయతీ విలీనం కావడంలో మిగిలిన 1368 పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా 358 సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి ఏకగ్రీవమయ్యాయి. సర్పంచ్‌ల పదవీకాలం 2026 ఏప్రిల్‌లో ముగియనుంది. మూడు నెలల ముందుగానే అంటే జనవరి చివర్లో లేదా ఫిబ్రవరి ప్రారంభంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది.ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం పంచాయతీల్లో వార్డులవారీగా జాబితా , రిజర్వేషన్ల ఖరారు, పోలింగ్ కేంద్రాల ఎంపిక, బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేసుకోవాల్సి వుంది. 2021 ఎన్నికల నుంచి మహిళలకు 50 శాతానికి రిజర్వేషన్ల శాతం పెరిగింది. ఈ ఎన్నికల్లో కూడా మహిళలకు అదే రిజర్వేషన్ కొనసాగే అవకాశాలున్నాయి.

ఆగని గజ విధ్వంసం



మూలమడుగులోని గుంతలో మునుగుతున్న ఒంటరి ఏనుగు

● వంద కొబ్బరిచెట్ల నేలమట్టం



పాతపేట వద్ద నేలకూలిన కొబ్బరిచెట్టు

కల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట వద్ద పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ముందుగా పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి శుక్రవారం రాత్రి బయలుదేరిన 15 ఏనుగుల గుంపు పాతపాళ్యం అడవి మీదుగా పాతపేట వద్దకు చేరుకున్నాయి. గ్రామ సమీపానికి ఏనుగుల గుంపు రావడంతో ప్రజలు భయంతో మిద్దెలపైకి చేరుకొని వాటి కదలికలను గమనించారు.పాతికేళ్ల వయసున్న సుమారు 100 కొబ్బరిచెట్లను నేలమట్టం చేసిన ఏనుగులు పలు రకాల పంటలను ధ్వంసం చేశాయి. సురేష్, దొరస్వామి, సోమశేఖర్, వెంకట్రమణ, నటరాజకు చెందిన సుమారు 50 కొబ్బరిచెట్లను , కుప్పయ్య, ఈశ్వర రెడ్డికి చెందిన వేరుశనగ, మామిడి, మునగ, బాదంచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. జయరాం, రెడ్డెప్ప, నాగరాజుకు చెందిన డ్రిప్‌పైపులను, రాతికూసాలను విరిచేశాయి. అనంతరం నాగరాజ పొలానికి సమీపంలోని ఉపాధి ఫారంపాండ్ నీటిగుంటలో దిగిన ఏనుగులు బురదలో చిక్కుకొని కొంతసేపు ఘీంకారం చేశాయి. కొంత సమయానికి నీటిగుంట నుంచి బయటకు వచ్చిన ఏనుగులు తిరిగి గోగులమ్మ వంక సమీపంలోని అడవిలోకి వెళ్లిపోయాయి. శనివారం పగలంతా గోగులమ్మ వంక సమీపంలో తిష్ట వేసినట్లు స్థానిక ప్రజలు తెలిపారు.కాగా గడ్డంవారిపల్లి పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెకు సమీపంలోని తూర్పు విభాగం అటవీ ప్రాంతంలో ఉన్న మూలమడుగులో శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది.శుక్రవారం రాత్రి పాపిరెడ్డిగారిపల్లెలో నాగరాజు, చిరంజీవికి చెందిన వేరుశనగ పంటను ఈ ఏనుగు ధ్వంసం చేసింది. అనంతరం అడవిలోని మూలమడుగు ప్రాంతానికి చేరుకుంది. శనివారం ఉదయం మూలమడుగులోని గుంతలో ఒంటరి ఏనుగు మునుగుతూ కేరింతలు పెట్టింది.



ధ్వంసమైన మామిడిచెట్టు

అధికార నంది వాహనంపై గణపయ్య విహారం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో మొదటిదైన అధికార నంది వాహన సేవను శనివారం రాత్రి వేడుకగా నిర్వహించారు.ఉభయదారులుగా వ్యవహరించిన కాణిపాకానికి చెందిన వళ్లువర్ వంశస్థుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు ఉదయం ఘనంగా అభిషేకం నిర్వహించారు.రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకు రావడంతో అలంకార మండపం వద్ద స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామివారిని అధికారనంది వాహనంపై భక్తి శ్రద్ధలతో ఉంచి భాజా, భజంత్రీలు వాయిస్తూ కాణిపాకం పుర వీధుల్లో ఊరేగించారు.ఈవో పెంచలకిషోర్, సూపరింటెండెంట్లు కోదండపాణి,వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు పాల్గొన్నారు.ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం వరసిద్ధుడికి రావణబ్రహ్మ వాహన సేవ నిర్వహిస్తారు. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సాయంత్రం ఆలయాన్ని మూసివేయనున్న కారణంగా ఈ సేవను ఉదయమే నిర్వహించనున్నారు.

పంచాయతీలకు సొంతగూడు

17 భవనాలకు రూ.32 లక్షల చొప్పున మంజూరు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 697 గ్రామ పంచాయతీలుండగా, వాటిలో సగానికి పైగా భవనాల్లో ఉద్యోగులు అరకొర వసతుల నడుమ విధులు కొనసాగిస్తున్నారు.చాలాచోట్ల అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పలుచోట్ల ఉపాధి హామీ పథకం అనుసంధాన నిధులతో నూతన భవనాలు నిర్మించారు. తాజాగా అవసరమైనచోట తొలివిడత కింద 17 గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ నిధులు మంజూరు చేశారు.ఒక్కో భవన నిర్మాణానికి కనీసం ఐదు సెంట్ల స్థలం ఉండాలి. ఇందులో 1226 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనం నిర్మించనున్నారు.ఒక్కో భవనానికి రూ.32 లక్షల చొప్పున మంజూరయ్యాయి. కాగా ఉపాధి హామీ పథకం కింద రూ.7 లక్షలు, మిగిలినవి రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద కేటాయించనున్నారు. బైరెడ్డిపల్లె మండలం పాతపేట, గౌనితిమ్మోపల్లి, విజయపురంలోని పాత ఆర్కాడ్, సామిరెడ్డికండ్రిగ, గంగాధరనెల్లూరులోని పాపిరెడ్డిపల్లె, గుడిపాలలో వెంగమాంబాపురం, గట్రాళ్ళమిట్ట, నగరిలో వేలవాడి, పెనుమూరులో కత్తిరెడ్డిపల్లె, తవణంపల్లెలో ముత్తుకూరు, రొంపిచెర్లలో జానవారిపల్లి, కార్వేటినగరంలో కేశవకుప్పం, ఐరాలలో 45 కొత్తపల్లి, రామకుప్పంలో ననియాల తాండా, బంగారుపాళ్యంలో జయంతి, నింద్రలో మేలబాకం, శాంతిపురంలో నడింపల్లెలో భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు డీపీవో సుధాకర రావు తెలిపారు.

వి.కోటలో చెరువులకు కృష్ణమ్మ కళ

7

● మొరవకు సిద్ధంగా దాసార్లపల్లె చెరువు

సింధురాజపురంవాసి అవయవ దానం



నిరంజన్ కుమార్ (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి అవయవాలను దానం చేసేందుకు అతడి కుటుంబసభ్యులు ముందుకొచ్చారు. ఎస్‌ఆర్‌పురం మండలం సింధురాజపురం గ్రామానికి చెందిన దశరథ నాయుడు, సుగుణమ్మ దంపతుల కుమారుడు నిరంజన్‌కుమార్ (40) బెంగళూరులోని ఓ గ్యారేజీలో పని చేస్తున్నాడు.గత ఆదివారం గ్యారేజీనుంచి బైకుపై ఇంటికి వస్తున్న నిరంజన్ అదుపుతప్పి కిందపడడంతో తలకు బలమైన గాయలయ్యాయి.చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి, శుక్రవారం మెరుగైన వైద్యం కోసం మణిపాల్ ఆస్పత్రికి తరలించారు.అక్కడి వైద్యులు పరీక్షించి బ్రెయిన్ డెడ్ అయిందని అతడి కుటుంబీకులకు చెప్పారు.అవయవ దానంపై వారికి అవగాహన కల్పించడంతో నిరంజన్ అవయవాలను ఇచ్చేందుకు వారు ముందుకొచ్చారు.నిరంజన్‌కు భార్య ఆశ, కుమార్తె నితిషా(10) ఉన్నారు.

తల్లికి భారమై..మృత్యు ఒడికి చిన్నారి

● ఆరునెలల ఆడబిడ్డను కాలువలో పడేసిన వైనం ● పేదరిక నేపథ్యంలో హతమార్చినట్లు తల్లి వెల్లడి



హత్యకు గురైన రమ్య

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పేదరికం అన్ని దారులనూ మూసేస్తుందంటారు. కష్టాలు మనిషిని మార్చేస్తుందంటారు. ఈ పరిస్థితుల్లోనే ఓ తల్లి పేగుబంధం మరిచిపోయింది. తాగుబోతు భర్త, పేదరిక పరీక్షలతో వేగలేక ఆరు నెలల పసికందును కాలవలో పడేసి చంపేసింది. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు....తిరుపతి సమీపంలోని కొరమేనుగుంటలో భూపతి, చందన దంపతులు ఉంటున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు. వీరికి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె దివ్యకు ఐదేళ్లు, రెండవ కుమార్తె కిత్యకు నాలుగేళ్లు. మూడోసారి మగబిడ్డ పుడతాడని భావించారు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం మూడో కుమార్తె రమ్య పుట్టింది. దీనికి తోడు భర్త తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. కుటుంబ పోషణ భారమంతా చందనపై పడింది. హాస్టల్లో పనిచేసే అత్తకు వచ్చే ఆరేడు వేల రూపాయలు కూడా ఎటూ చాలడం లేదు. ఈ నేపథ్యంలో మూడో సంతానం రమ్యను ఎలాగైనా వదిలించుకోవాలని చందన నిర్ణయించుకుంది.శనివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లే సమయంలో పసిబిడ్డను మురికి కాలువలో పడేసి చంపేసింది. తర్వాత బిడ్డ కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్పీ హర్షవర్ధనరాజు వెంటనే డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రాంకిషోర్‌ను వెంటపెట్టుకుని ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ఎక్కడా అచూకీ దొరకలేదు. చందన, భూపతిలను అదుపులోకి తీసుకుని విచారించారు. బిడ్డను తీసుకుని బహిర్భూమికి వెళ్తుండగా చంకలోని చిన్నారి రమ్య మురికి కాలువలోకి జారి పడిపోయిందని చందన చెప్పింది. ఆమె చెప్పిన చోట డ్రోన్ల సహాయంతో గాలించినా దొరకలేదు. భార్యాభర్తలు భిన్న కోణాల్లో చెబుతుండడంతో పోలీసులు అనుమానించారు. తమదైన శైలిలో వారిని విచారించారు.దీంతో చందన నేరం అంగీకరించింది. పేదరికంతో కుటుంబ పోషణ కష్టంగా మారి మనసు కఠినం చేసుకుని తానే ఆరు నెలల రమ్యను కాలువలో పడేసి చంపేశానని చెప్పింది. పోలీసులు రమ్య మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశారు. నిందితురాలు చందనను అరెస్ట్ చేసి, హత్య కేసు నమోదు చేశారు.



→ రమ్య తల్లి చందన



జస్టిస్ వైద్యనాథన్



జస్టిస్ మన్మథరావు



జస్టిస్ ఇందిరేష్



జస్టిస్ అనిరుధ పీ మాయి

తిరుమలలో పలువురు న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని శనివారం వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వీరిలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మన్మథరావు, జస్టిస్ ఈఎస్ ఇందిరేష్, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిరుధ పీ మాయి, మేఘాలయ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్ ఉన్నారు. ఇంకా నటుడు దాసరి అరుణ్‌కుమార్ కూడా స్వామిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.49 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 69,531

తలనీలాలు సమర్పించినవారు: 31,439



శలభాసనంలో శెభాష్.. ద్వారకేష్


● యోగాలో క్లిష్టమైన ప్రక్రియలో గిన్నిస్ రికార్డు

యోగా.. శరీరాన్నీ, మనసునూ నియంత్రించే గొప్ప ప్రక్రియ. మనదేశ సాంస్కృతిక సంపదలో భాగమైన ఈ ఆరోగ్య ప్రక్రియ ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందింది. అయితే 55ఏళ్ల క్రితమే దీని ప్రాధాన్యతను గుర్తించి అనుసరించారు గూడూరుకు చెందిన కట్టా మురళీకృష్ణ. ఆసనాలను అతి సులభంగా వేస్తూ ఆ రోజుల్లోనే అబ్బురపరిచేవారు. ఆయన వారసత్వాన్నే పుణికి పుచ్చుకున్న ఆయన మనవడు మరో అడుగు ముందుకేశాడు. యోగాలో కష్టతరమైన శలభాసనం వేసి గిన్నిస్ రికార్డు సాధించాడు. అందరి దృష్టినీ ఆకట్టుకుని ఔరా అనిపించుకుంటున్నాడు. యోగాసనాలు వేసేవారికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడీ పిన్న వయస్కుడు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు అందుకుంటూ..



కట్టా వెంకట ద్వారకేష్.. గూడూరు సొసైటీ కాలనీకి చెందిన ఈ యువకుడు బెంగళూరులో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. యోగా రంగంలో అద్భుతాలు ఆవిష్కరిస్తున్నాడు. ఇతని తాత మురళీకృష్ణ 1970లో ఆధ్యాత్మిక యోగ వెల్ఫేర్ అసోసియేషన్‌ను స్థాపించారు. యోగా గురువుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈయన కుమారుడు రాజ్‌కుమార్ కూడా తండ్రిని అనుసరించాడు. 1996లో గూడూరులో మొదటిసారిగా యోగా, జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు. పట్టణ ప్రజలకు ఆరోగ్యకరమైన శరీరసౌష్టవ సాధన, యోగాల గురించి లోతుగా పరిచయం చేశాడు. తండ్రి, తాతల ప్రభావంతో ద్వారకేష్ కూడా ఇదే రంగంపై మక్కువ పెంచుకున్నాడు. చిన్నతనం నుంచే కఠోర ఆసనాలను సాధన చేయడం ప్రారంభించాడు. శరీరాన్ని ధనుస్సులా వంచేయడం అలవాటు చేసుకున్నాడు. 2006లో చెన్నైలో జరిగిన జాతీయస్థాయి యోగ పోటీలలో ప్రతిభను చాటి బంగారు పతకాన్ని సాధించాడు. పాఠశాల నుంచి అన్ని స్థాయిల్లోనూ నిర్వహించే యోగాసనాల పోటీలలో ప్రతిభ చాటాడు ద్వారకేష్. ఈ క్రమంలోనే గతేడాది చెన్నైలో నిర్వహించిన ఖేలో ఇండియాలో 345 నిమిషాల పాటు శలభాసనం వేసి అబ్బురపరిచాడు. ప్రపంచ గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సాధించగలిగాడు.

ఏమిటీ ఆసనం :

క్రమశిక్షణ, కఠోరసాధన, మనో ధైర్యం, మానసిక సమతుల్యత, ఊపిరి నియంత్రణపై పట్టు ఉంటే తప్ప ఈ తరహా శలభాసన ప్రక్రియలో ఎక్కువసేపు కొనసాగడం కష్టమని యోగా నిపుణులు చెబుతారు. ఈ యోగా భంగిమలో బోర్లా పడుకుని కాళ్లు, ఛాతిని నేల నుంచి పైకి లేపుతూ మిడత ఆకారాన్ని అనుకరిస్తారు. అందుకే దీనిని మిడతాసనం అని కూడా అంటారు. ఈ ఆసనం వెన్నెముక, వీపు కండరాలకు బలాన్నిస్తుందని ద్వారకేష్ చెబుతాడు. జీర్ణ ప్రక్రియ మెరుగుపరచడంలోనూ, పొత్తి కడుపులో పేరుకుపోయే కొవ్వును కరిగించడానికి దోహదపడుతుందంటున్నాడు. అనేక అనారోగ్య సమస్యలను యోగా ద్వారా నయం చేసుకోవచ్చునని అంటున్నాడీ యువకుడు. భవిష్యత్తులో యోగా శిక్షణ సంస్థలను ఏర్పాటు చేసి యువతను యోగాసనాల వైపు నడిపించాలనే లక్ష్యమని ఆంధ్రజ్యోతికి వివరించాడు ద్వారకేష్.



శలభాసనంలో ద్వారకేష్

మల్లికార్జున ప్రయాణం స్ఫూర్తిదాయకం

సత్యవేడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఒకప్పుడు శ్రీసిటీలో ఉద్యోగిగా పయనం మొదలుబెట్టి, నేడు పారిశ్రామికవేత్తగా ఎదిగిన మల్లికార్జున ప్రస్థానం యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకమని వీఎస్ఎన్ఎల్ మాజీ చైర్మన్, ఏపీ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి కొనియాడారు.శ్రీసిటీలో శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారు చేసే స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభమైంది.హనుమాన్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, స్మైల్ ఎకో మేనేజింగ్ డైరెక్టర్ పరుచూరి మల్లికార్జున సమక్షంలో పరిశ్రమను లాంఛనంగా ప్రారంభించారు. రూ.20 కోట్ల పెట్టుబడితో స్థాపించిన ఈ ప్లాంట్ ఏడాదికి 259.2 మిలియన్ల శానిటరీ న్యాప్‌కిన్‌లను తయారు చేస్తుంది. దాదాపు 200 మందికి పైగా ఉద్యోగాలు లభిస్తాయి. ఇక్కడి ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాలకు ఎగుమతులు చేస్తారు. పరిశ్రమ ఎండీ మల్లికార్జునను శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. వరదయ్యపాళెం మండలంలోని వెంకటరెడ్డి కండ్రిగకు చెందిన మల్లికార్జున ఒకప్పుడు శ్రీసిటీలో ఉద్యోగిగా పయనం మొదలు బెట్టి, నేడు పారిశ్రామికవేత్తగా ఎదగడం యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సంతోషదాయకమన్నారు.



పరిశ్రమను ప్రారంభిస్తున్న హనుమాన్ చౌదరి

తిరుమలలో శాస్త్రోక్తంగా చక్రస్నానం

తిరుమల, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభవ్రతం సందర్భంగా శనివారం ఉదయం తిరుమల శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంత పద్మనాభవ్రతాన్ని ఏటా భాద్రపద శుక్ల చతుర్దశి రోజున నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఉదయం పూజలు చేసిన తర్వాత సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి వరాహస్వామి ఆలయం చెంత ఉన్న పుష్కరిణిలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేపట్టారు. అనంతరం చక్రస్నానాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

● 35 గ్రాముల బంగారు, 350 గ్రాముల వెండి ఆభరణాల స్వాధీనం

బంగారు వెండి ఆభరణాలతో దొంగ అరెస్టు చూపిస్తున్న గాజుల మండ్యం పోలీసులు →



రేణిగుంట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ తంగముత్తును గాజులమండ్యం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు వివరాల మేరకు.. గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021 నుంచి రాత్రిపూట ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీ చేస్తున్న ఘటనలు నమోదయ్యాయి. వేలిముద్రల ఆధారంగా తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లా తిరుచెందూరుకు చెందిన తంగముత్తు ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మరో చోరీకి సన్నద్ధమయ్యే క్రమంలో శనివారం ఉదయం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తచ్చాడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 35 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన గాజులమండ్యం సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుళ్లు గోపి, రాజేష్, సుబ్రహ్మణ్యం, కానిస్టేబుళ్లు వేణుగోపాల్, గోపి, మణి, మురళి వాసును అభినందించి, రివార్డులు అందజేశామని డీఎస్పీ తెలిపారు.

ఫ్రిక్షన్ ఆధారిత రంగంలో సవాళ్లను అధిగమించాలి

● భావితరాల పరిశోధకులకు ఇన్‌స్పైర్‌గా ఐసీఎఫ్‌పీ సదస్సు ● మిధాని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి

తిరుపతిరూరల్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): ఫ్రిక్షన్ (ఘర్షణ) ఆధారిత ప్రాసెసింగ్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంలో పరిశోధకులు కీలకపాత్ర పోషించాలని హైదరాబాద్‌కు చెందిన మిధాని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి పేర్కొన్నారు. తిరుపతిలోని ఓల్డ్ తిరుచానూరు రోడ్డులో ఉన్న ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ప్రాసెసింగ్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ ప్రొడక్ట్స్(ఐఏ-పీఎంఎఫ్‌పీ) ఆధ్వర్యంలో తిరుపతి ఐఐటీ, పాట్నా ఐఐటీ, ఐఐఎస్సీ (బెంగళూరు) సహకారంతో మూడ్రోజుల ఫ్రిక్షన్ బేస్డ్ ఇంటర్నేషనల్ సదస్సు(ఐసీఎఫ్‌పీ-2కే25)ను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సదస్సుపై రూపొందించిన పుస్తకాన్ని ఐసీఎఫ్‌పీ అధ్యక్షుడు సత్యం సువాస్, బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ సతీష్ విక్రైలాష్, తిరుపతి ఐఐటీ డీన్ ప్రొఫెసర్ అరుణ్‌తంగిరాల, ఐఏ-పీఎంఎఫ్‌పీ అధ్యక్షుడు ప్రొఫెసర్ టీఎస్ శ్రీవాత్సవ్‌లతో కలసి ఆయన ఆవిష్కరించారు. నారాయణమూర్తి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల పరిశోధకులకు ఈ సదస్సు ఇన్‌స్పైర్‌గా ఉంటుందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ఈ రంగంలో పరిశోధకులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కాగా ఘర్షణ ఆధారిత తయారీ, స్మార్ట్ మ్యానుఫాక్చరింగ్ తయారీ, సాంకేతికతల అభివృద్ధిపై పలువురు వక్తలు ఉపన్యసించారు. కన్వీనర్‌గా తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ అజయ్‌కుమార్ వ్యవహరించారు. 8దేశాలకు చెందిన అంతర్జాతీయ పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి, సత్యం సువాస్ తదితరులు

శ్రీసిటీలో చెన్నై ఏంజిల్స్ ప్రతినిధుల బృందం



ప్రతినిధుల బృందంతో శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఏంజిల్స్‌కు చెందిన 19 మంది ప్రతినిధుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. కె.మహాలింగం నేతృత్వంలోని బృంద సభ్యులకు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచ శ్రేణి మౌలిక వసతులు, వ్యాపార అనుకూలమైన వ్యవస్థలను వివరించారు. శ్రీసిటీ పర్యటనలో ఉన్న వీఎస్ఎన్ఎల్ మాజీ చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ హనుమాన్ చౌదరితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టెలికం రంగంలో అపార అనుభవం ఉన్న చౌదరి, ఆయన అనుభవాలను, పలు సాంకేతిక పురోగతికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీసిటీ పారిశ్రామిక కార్యకలాపాలు, ఇక్కడ అనుసరిస్తున్న పద్ధతులు అధ్యయనం, పెట్టుబడి అవకాశాల పరిశీలన దిశగా బృందం పర్యటన సాగింది. అనంతరం శ్రీసిటీలోని డైకిన్, ఇసుజు, కోల్గేట్, ఎప్సాక్, ఎవర్ ఓల్డ్, సీఈటీసీ తదితర పరిశ్రమలను బృందం సందర్శించింది.

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

● నేడు పద్మావతీ అమ్మవారి ఆలయం మూసివేత

తిరుచానూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొపి సహస్రనామార్చన, నిత్యార్చన చేపట్టారు. తర్వాత అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవర్లకు, ఉపాలయాలకు, పరివార దేవతలకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు యాగశాలలో ఆరాధన, హోమాలు, నివేదన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, చంద్రగ్రహణంలో భాగంగా అమ్మవారి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 2.15 గంటలకు మూసివేయనున్నారు. తిరిగి సోమవారం వేకువజామున తలుపులు తెరచి, ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తర్వాత భక్తులకు అమ్మవారు దర్శన భాగ్యం ఇవ్వనున్నారు.



ఉత్సవమూర్తికి పవిత్రమాలలు సమర్పిస్తున్న అర్చకులు

కారు దగ్ధం



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంటలు చెలరేగి కారు దగ్ధమైన ఘటన తిరుపతి మంగళం రోడ్డులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. తిరుపతి అగ్నిమాపక దళాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి వివరాల మేరకు.. తిరుచానూరుకు చెందిన ఎంటీ కిరణ్ కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి మంగళం రోడ్డులోని సురక్ష ఆసుపత్రికి కారులో వస్తున్నారు. ఫ్లైవోవర్ వద్ద వెళుతుండగా ఇంజిన్ వేడెక్కి మంటలు చెలరేగాయి. వెంటనే కారులో ఉన్న వారు కిందకు దిగేశారు. ఆ మార్గంలో వెళుతున్న అలిపిరి సీఐ రాంకిషోర్ తన సిబ్బంది సహాయంతో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేశారు.

వెంకటగిరికి చేరిన పర్యావరణ ప్రేమికుడి యాత్ర

వెంకటగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోరుతూ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తు సెల్వన్ చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం వెంకటగిరికి చేరింది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఆయన పట్టణంలోని విశ్వోదయ కాలేజీ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ముత్తు సెల్వన్ 2021లో సైకిల్ యాత్రను ప్రారంభించి, నాలుగేళ్లుగా కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. ముత్తు సెల్వన్ మాట్లాడుతూ కరోనా కాలంలో ఆక్సిజన్ కొరతతో జనాలు చనిపోవడం చూసి బయోమెట్రికల్ ఇంజనీరుగా పనిచేస్తున్న తాను విధులకు రాజీనామా చేసి సైకిల్ యాత్ర చేపట్టానన్నారు. పర్యావరణ ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్యపరుస్తూ ఎనిమిది దేశాలలో సైకిల్ యాత్ర పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నేపాల్, బంగ్లాదేశ్‌లో పర్యటన పూర్తయిందని, మన దేశంలో 23 రాష్ట్రాలు, ఏపీలో 10 జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో యాత్ర పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1,356 రోజులు 38,600 కిలోమీటర్లు ప్రయాణించినట్లు వెల్లడించారు. 8లక్షల మొక్కలు నాటినట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆయన్ను సత్కరించి, ఆర్థిక సాయం అందించారు.



ఎమ్మెల్యేతో కలిసి మొక్కనాటుతున్న పర్యావరణ ప్రేమికుడు ముత్తు సెల్వన్

ఉపాధి బకాయిలు రూ.50.20కోట్లు

● 16 వారాలుగా కూలీలకు అందని వేతనాలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మే నుంచి ఇప్పటివరకు రూ.50.20 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. మెటీరియల్ కాంపోనెంట్(సీసీరోడ్లు, డ్రైన్లు, గోకులాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి) కింద రూ.70 కోట్లు రావాల్సి ఉంది. గడచిన నాలుగు నెలలు(16 వారాలు)గా కూలీలకు బిల్లులు సరిగా ఇవ్వడం లేదు. ఈ కారణంతో పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. జిల్లాలోని 774 పంచాయతీల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 53 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. మరో 8 నెలల్లో 50 లక్షల పనిదినాలు పూర్తి కావాల్సి ఉంది. బిల్లులు రాకపోవడంతో కుటుంబం గడవటం కష్టమవుతోందని, ప్రతివారమూ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

త్వరలోనే బకాయిలు చెల్లిస్తాం

● శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ

ఉపాధి హామీ పథకం కూలీలకు త్వరలోనే వారి ఖాతాకు బకాయిలు జమచేస్తాం. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. జిల్లాలో 16 వారాలకు సంబంధించి 1.71లక్షల మంది కూలీలకు రూ.50కోట్లపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం చేసిన అభివృద్ధి పనులకు మరో రూ.70కోట్లు రావాల్సి ఉంది.

రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు పంపిణీ చేయండి

● 'పీజీఆర్ఎస్' నుంచి వ్యవసాయశాఖ అధికారులకు మినహాయింపు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది లేకుండా సోమవారం నుంచి ఆర్ఎస్కేలలో ఎరువుల పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీసు శాఖలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. శనివారం రాత్రి జేసీ విద్యాధరితో కలిసి వ్యవసాయశాఖ అధికారులు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం జరిగే పీజీఆర్ఎస్ నుంచి వ్యవసాయశాఖ అధికారులందరికీ మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్ఎస్కేల వద్ద ఏర్పాట్లు, టోకెన్లు తదితరాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాకు వెయ్యి టన్నుల ఎరువులు అందాయన్నారు. ఇందులో 700 టన్నులు ఆర్ఎస్కేల ద్వారా, మిగిలిన 300 టన్నులు ప్రైవేటుగా పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఎక్కడా అవకతవకలకు తావివ్వరాదని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి అరుణ సారిక

చిత్తూరు లీగల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా జడ్జి అరుణ సారిక అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో బాలనేరస్తులకు సంబంధించిన చట్టాలపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పోలీసులు, న్యాయవాదులు చట్టాలపై పూర్తి అవగాహన ఉంటేనే బాధితులకు న్యాయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

రేపు న్యాయవాదుల విధుల బహిష్కరణ

సోమవారం విధులు బహిష్కరిస్తున్నట్లు చిత్తూరు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం కోర్టులో ఓ సీనియర్ న్యాయవాదిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం


పెద్దన్నను అభినందిస్తున్న కంచర్ల, పీఎస్ఎం

రామకుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా శాంతిపురం మండలానికి చెందిన పెద్దన్నను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ కడపల్లె యూనిట్ ఇన్‌చార్జిగా ఉన్న పెద్దన్న ప్రతిపక్షంలో ఉన్నపుడు పార్టీ పటిష్ఠతకు కృషి చేశారు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమకేసులతో జైలుకు సైతం వెళ్లాడు. పార్టీపై అతడి నిబద్ధతను గుర్తించి టీడీపీ అధిష్ఠానం రాష్ట్ర స్థాయి డైరెక్టరు పదవితో అతడికి సముచిత స్థానం కల్పించింది. శనివారం శాంతిపురంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్‌మునిరత్నంతోపాటు నియోజకవర్గ, మండల నేతలు పెద్దన్నను ఘనంగా సన్మానించారు.

ఉన్మాదిని కరెంటు స్తంభానికి కట్టేశారు



కుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం జోగిండ్లు అనే గ్రామంలో ఒక వృద్ధుడిని గ్రామస్తులు చెట్టుకు కట్టేయడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. డీఎస్పీ పార్థసారథి కథనం మేరకు.... జోగిండ్లు గ్రామంలో గోవిందప్ప (57) అనే వృద్ధుడు శనివారం ఉన్మాదంగా ప్రవర్తించాడు. సొంత తమ్ముళ్లతో పాటు, గ్రామస్తులను రాళ్లతో కొడుతూ బాధించాడు. దీంతో అందరూ కలిసి అతడిని ఒక కరెంటు స్తంభానికి బంధించారు. మానసిక స్థితి బాగలేని గోవిందప్ప నుంచి తమను తాము కాపాడుకోవడానికే గ్రామస్తులు ఈ పని చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

మహిళా సాధికార సదస్సుకు అతిరథమహారథులు

ఏర్పాట్లపై సమీక్షించిన అసెంబ్లీ సెక్రటరీ జనరల్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా ఈనెల 14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికార సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ అన్నారు. సదస్సు జరగనున్న తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను, చంద్రగిరి కోటను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. అంతకుముందు జిల్లా అధికారులతో సదస్సు ఏర్పాట్లపై సమీక్షించారు.సదస్సుకు దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ప్రజాప్రతినిధులు హాజరై రెండు రోజులపాటు మహిళల సమస్యలపై సుదీర్ఘంగా చర్చిస్తారని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ సదస్సుకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, మంత్రులు వస్తుండడంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 14వ తేదీ రాత్రి సదస్సుకు విచ్చేస్తున్న ప్రజాప్రతినిధులు చంద్రగిరి కోటను సందర్శించి, లైటింగ్ షోను వీక్షించి, అక్కడే డిన్నర్ చేస్తారని తెలిపారు.




ఆలయం వద్ద భక్తుల సందడి - వరపడిన మహిళలు - వాహనాలతో వస్తున్న భక్తులు

జనసంద్రంగా అక్కదేవతల ఆలయం

సోమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం గట్టువారిపల్లెలో కొలువుదీరిన అక్కదేవతల ఆలయంలో ఉత్సవాల సందర్భంగా ఆలయ సముదాయం భక్తులతో కిటకిటలాడింది. ఐదేళ్లకు ఒక పర్యాయం నిర్వహించే పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయంలో అక్కదేవతలకు శాస్త్రోక్తంగా అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంజంపేట నుంచి పుష్పపల్లకీ సేవలు, చెక్కభజనలతో కోలాహలంగా ఆలయం వద్దకు చేరుకున్నారు. కోర్కెలు తీరిన భక్తులు మొక్కుబడులు తీర్చుకోవడానికి వాహనాలతో ఆలయం వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. ఈ క్రమంలోనే వాహనాలకు విశేష పూజలు చేసి ఉపవాస దీక్షలతో అక్కదేవతల ఆలయంలో వాహనాలను ప్రతిష్ఠించారు. పలువురు మహిళలు తమ కోర్కెలు సాధన కోసం నదీస్నానం చేసి ఆలయం వద్ద వరపడి ఆలయం వద్ద పూజలు చేశారు. పలువురు భక్తులు ఆలయం వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే గట్టువారిపల్లె ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో సోమల, నంజంపేట, కమ్మపల్లె, గట్టువారిపల్లె, అడుసుపల్లె, శీలంవారిపల్లె, గురికానివారిపల్లె, సవరంవారిపల్లె, చీలంవారిపల్లె తదితర గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు జరిపారు.

కుప్పంలో వి.కోట వాసి అనుమానాస్పద మృతి


రాజయ్య మృతదేహం

కుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వి.కోటకు చెందిన నందగోపాల్ (50) అనే వ్యక్తి కుప్పంలో అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. వి.కోటకు చెందిన నందగోపాల్, భార్యాపిల్లలతో కలిసి శుక్రవారం కుప్పం పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న తన మామ రాజప్ప ఇంటికి వచ్చాడు. హై బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధులు ఉన్న అతడు కుప్పంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. శనివారం ఉదయం నిద్రలేచి బహిర్భూమికి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మళ్లీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. పెద్దపల్లి గంగమ్మ గుడి సమీపంలోని రైలు పట్టాల వద్ద గల పొదల్లో రాజప్ప శవమై కనిపించాడు. ముఖంపై కారిన రక్తం, చీము మరకలు ఉండటంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కుప్పం ప్రభుత్వాస్పత్రికి నందగోపాల్ మృతదేహాన్ని చేర్చి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య వివరణ ఇస్తూ.. లోబీపీ, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న నందగోపాల్ రెండుమూడు రోజుల క్రితం ఇంట్లో పడి తల వెనుక బలమైన గాయమైందన్నారు. చికిత్సకోసం కుప్పంలోని మామయ్య ఇంటికి వచ్చాడన్నారు. బహిర్భూమికని వెళ్లిన నందగోపాల్‌కు లోబీపీ అధికమై కింద పడి ఉంటాడని.. తలకు ఇదివరకే ఉన్న గాయం మరింత ఎక్కువై అందులోంచి చీమునెత్తురు కారి మృతి చెందాడని చెప్పారు. కుటుంబ సభ్యులు సైతం ఇదే చెప్పారని వివరించారు.

ప్రియురాలు పెళ్లికి నిరాకరించిందని బావిలో దూకి ఆత్మహత్య


సతీష్ మృతదేహం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాణంగా ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందని ఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో పట్టణ సీఐ నెట్టి కంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు తేనబండ దళితవాడకు చెందిన సతీష్(27) తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో మరణించారు. అప్పటి నుంచి చిన్న చిన్న పనులు చేసుకుంటూ అక్క బుజ్జి ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో కాలనీలోనే ఓ యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. ఈ విషయాన్ని అక్క ద్వారా ప్రియురాలి తల్లిదండ్రులకు తెలియజేశాడు. అయితే వారు పెళ్లికి ఒప్పుకోలేదు. ప్రియురాలు కూడా తల్లిదండ్రుల మాటను కాదనలేక పెళ్లికి నిరాకరించింది. దీన్ని తట్టుకోలేక పది రోజులుగా బాధ పడుతూనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తేనబండ మురాద్‌బాబా దర్గా సమీపంలో ఉన్న బావిలో దూకేశాడు. శనివారం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి అక్క ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి శనివారం సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. ఉదయం నుంచి వేల సంఖ్యలో భక్తులు స్వామి దర్శనార్థం ఆలయానికి విచ్చేయడంతో ఆలయంలో రద్దీ వాతావరణం ఏర్పడింది. ప్రతి భక్తుడికీ స్వామి దర్శనం కల్పించడానికి సిబ్బందితో కలిసి ఈవో పెంచలకిషోర్ కృషి చేశారు.

వేద సభ

కాణిపాక అలంకార మండపం ముందు భాగంలో శనివారం వేద సభ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ఆలయాల నుంచి వేదపండితులు విచ్చేశారు. ప్రత్యేక ఉత్సవాల మొదటి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈవోతోపాటు డీఈవో సాగర్ బాబు, ఏఈవో రవీంద్రబాబు, అర్చక, పండితులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల మూసివేత

చంద్రగ్రహణం కారణంగా ఆదివారం వరసిద్ధుడి ఆలయంతోపాటు అనుబంధంగా ఉన్న మణికంఠేశ్వర స్వామి, వరదరాజస్వామి ఆలయాలను ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి మూసివేయనున్నారు. గ్రహణానంతరం సోమవారం ఉదయం నాలుగు గంటలకు ఆలయాన్ని తెరిచి.. శుద్ధి, పుణ్యాహవచనం, గ్రహణ శాంతి, స్వామికి అభిషేకం చేయనున్నారు. అనంతరం భక్తులకు స్వామిని దర్శనానికి అనుమతిస్తామని ఈవో తెలిపారు.



స్వామి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు, ఆలయంలో నిర్వహించిన వేద సభ

నేడు ముక్కంటి ఆలయంలో గ్రహణ కాలాభిషేకం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి గ్రహణ కాలాభిషేకం నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి నవగ్రహాలను కవచంగా ధరించి ఉంటారు. అందుకే ఈ క్షేత్రంలో గ్రహణ కాల సమయంలోనూ ఆలయాన్ని తెరచి ఉంచి, విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. ఆదివారం రాత్రి రాహుగ్రస్త చంద్రగ్రహణం స్పర్శాకాలం 9.50గంటలకు ప్రారంభమై అర్ధరాత్రిపైన 1.31గంటలకు మోక్షకాలంతో గ్రహణం విడుపుగా ఆగమ పండితులు నిర్ణయించారు. ఈ మేరకు మధ్యకాలం 11.41 గంటల సమయంలో మూలమూర్తులకు అభిషేకం నిర్వహించనున్నారు. అర్ధరాత్రి వేళ కావడంతో భక్తులకు అనుమతి లేదని అధికారులు ప్రకటించారు. అర్చకులు మాత్రమే గ్రహణకాల అభిషేకం నిర్వహించనున్నారు.

అమ్మవారి పంచలోహ విగ్రహం లభ్యం



పుంగనూరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు శివారు ప్రాంతంలో భూమి చదును చేస్తుండగా ఓ వ్యక్తికి నాలుగు కిలోల పంచలోహాల అమ్మవారి విగ్రహం లభించిన విషయం ఆలస్యంగా శనివారం వెలుగుచూసింది. వివరాలిలా... పట్టణానికి చెందిన సలీంబాషాకు స్థానిక పలమనేరు రోడ్డులోని బాలాజీ థియేటర్ సమీపంలో కొంత స్థలం ఉండటంతో 18 రోజుల క్రితం భూమిని చదును చేసి ఫెన్సింగ్ కోసం తీసిన గాడిలో సుమారు 4 కేజీల పంచలోహ విగ్రహం బయటపడింది. అయితే ఈ విషయం బయటకు రావడంతో శనివారం ఉదయం స్థానిక తూర్పుమొగసాలలోని చాముండేశ్వరిదేవి ఆలయ అర్చకులకు ఆ విగ్రహాన్ని అందివ్వడంతో ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నారు.

రూ.25 కోట్ల ఆలయ భూములకు విముక్తి

ఎర్రావారిపాలెం,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): వివిధ ఆలయాలకు చెందిన రూ.25 కోట్ల విలువ చేసే భూములకు విముక్తి కలిగింది. వివరాలిలా.. మండలంలో పది రెవెన్యూ గ్రామాల పరిధిలో గతంలో 29 ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు, నిర్వహణకు పలువురు దాతలు భూములు విరాళంగా అందజేశారు. ఇవి రెవెన్యూ రికార్డుల్లో ఆలయాల పేరిట నమోదై ఉన్నాయి. కాలక్రమేణా కొన్ని ఆలయాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. వీటిని సాగు చేసుకుంటూ తమ భూమిగానే ఆక్రమణదారులు చెప్పుకొస్తున్నారు. తొలినాళ్లలో కొందరు పంటలో సగం ఆదాయం ఆలయాలకు అందజేశారు. వారి తరం కనుమరుగవ్వడంతో తర్వాత వారసులు ఇవ్వడం మానుకున్నారు. పైగా సాగులో ఉన్న భూములకు పట్టాలు పొందేందుకు ప్రయత్నించారు. తలకోన ఆలయ ఈవో రవీంద్రరాజు ఇటీవల ఈ విషయంపై దృష్టి సారించారు. తహసీల్దార్ పరమేశ్వరస్వామితో సంప్రదించారు. భూముల వివరాలను అందజేశారు. భూములపై తిరిగి ఆలయాలకు యాజమాన్య హక్కులు కల్పించేలా మ్యుటేషన్ కోరుతూ దరఖాస్తు చేశారు. తహసీల్దార్ రికార్డులను లోతుగా పరిశీలించి 130 ఎకరాల భూములకు మ్యుటేషన్ ఆమోదించారు. ప్రస్తుతం ఈ భూముల మార్కెట్ విలువ రూ.25 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. శనివారం భూముల పత్రాలను తహసీల్దార్ తలకోన ఈవోకు అందజేశారు.

ఆర్థిక సంఘం నిధులను దుర్వినియోగం చేయొద్దు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘ నిధులను దుర్వినియోగం చేయొద్దని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. శనివారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. పంచాయతీలకు కేటాయించిన నిధులను తాగునీరు, కాలువల నిర్వహణ, పరిశుభ్రతకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్, ఎంపీడీవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మురకంబట్టుకు చెందిన డింపుల్ (24) శుక్రవారం ఉదయం ఇంటికి సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను దర్శించుకొస్తానని వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియరాలేదు. ఈ మేరకు శనివారం కుటుంబీకుల ఫిర్యాదుతో ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

వి.కోటలో చెరువులకు కృష్ణమ్మ కళ

● మొరవకు సిద్ధంగా దాసార్లపల్లె చెరువు




హంద్రీ-నీవా కాలువ నుంచి పత్రపల్లె చెరువుకు ప్రవహిస్తున్న కృష్ణాజలాలు - మొరవ ప్రవహించేందుకు సిద్ధంగా ఉన్న దాసార్లపల్లె చెరువు - శుభ్రమైన కీలపల్లె సప్లై ఛానెల్

వి.కోట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువ నుంచి కృష్ణా జలాలు వి.కోట మండల పరిధిలోని పలు చెరువులకు చేరుతుండటంతో చెరువులకు జలకళ సంతరించుకుంటోంది. గత వారం రోజులుగా దాసార్లపల్లె చెరువుకు కాలువ నుంచి నీటిని విడుదల చేయడంతో చెరువు పూర్తి స్థాయిలో నిండి మొరవ ప్రవహించేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే పెద్దబరిణేపల్లె వెంగన్న చెరువు, పత్రపల్లె పెద్ద చెరువు, పైపల్లె రాయప్ప చెరువు, కొత్తూరు చెరువు, ముదిమడుగు చెరువు, మిట్టూరు చెరువులకు జలవనరుల శాఖ అధికారులు నీటిని విడుదల చేశారు. గత రెండు రోజులుగా హంద్రీ-నీవా కాల్వలో నీటి ప్రవాహం పెరగడంతో ఆదినేపల్లె లిఫ్టుకు ఎగువనున్న చెరువులకు గేట్లు ఎత్తి అధికారులు నీటిని వదిలారు. పత్రపల్లె చెరువుకు పడమర కాల్వ నుంచి హోరున కృష్ణాజలాలు వస్తుండటంతో చెరువు 30 శాతం నీటితో జలకళ సంతరించుకుంది. దాసార్లపల్లె చెరువు మొరవ ప్రవహిస్తే వి.కోట కీలపల్లె చెరువుకు చేరుకుంటాయి. మరో వైపు పత్రపల్లె, ముదిమడుగు చెరువులు సైతం నిండితే వాటి మొరవలు వి.కోట పెద్ద చెరువుకు రానున్నాయి. పత్రపల్లె చెరువు నుంచి వి.కోట చెరువు వరకు ఉన్న కీలపల్లె సప్లై ఛానెల్ చాలా కాలంగా పేరుకుపోయిన ముళ్లపొదలను, చెత్తాచెదారాలను జలవనరుల శాఖ తొలగించారు. దీంతో కాలువలో అవాంతరాలు లేకుండా నీరు వేగంగా కీలపల్లె చెరువుకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ సప్లై ఛానెల్‌కు ఇరు వైపులా లైనింగ్ చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో లైనింగ్ పనులు ప్రారంభం కానున్నాయి. మొత్తానికి ఆగస్టు నెలలో రెట్టింపు వర్షపాతం వి.కోట మండలంలో నమోదైనా చెరువులో నీటి జాడలు కనిపించలేదు. హంద్రీ-నీవా కాల్వ నుంచి కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు నీటి ప్రవాహం మొదలైనప్పటి నుంచి చెరువులకు జలకళ సంతరించుకుంటోంది. రానున్న రోజుల్లో ఇంకా మరిన్ని చెరువులకు కృష్ణాజలాలు రానుండటంతో తమ ప్రాంతం ఇక సస్యశ్యామలం కానున్నట్లు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన కుప్పం టీడీపీ నేతలు



అజీజ్‌ను కలిసి శుభాకాంక్షలు చెబుతున్న జాకీర్, ఉమాపతి

కుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను కుప్పం నియోజకవర్గ టీడీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు జాకీర్, నాయకుడు ఉమాపతి శనివారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో తనకి పదవి వచ్చిందని, తనతోపాటు వక్ఫ్ బోర్డు సభ్యులందరూ మైనారిటీల సంక్షేమానికి, అల్లా ఆస్తులు కాపాడేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అజీజ్ పిలుపునిచ్చినట్లు జాకీర్ తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో మైనారిటీల స్థితిగతులు, వారికి అందుతున్న పథకాలు తదితరాల గురించి ఆరా తీసినట్లు చెప్పారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం



తిమ్మారెడ్డి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బగళనత్తంకు చెందిన టీడీపీ కార్యకర్త తిమ్మారెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డిలు స్థానిక నేతలతో కలిసి తిమ్మారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి పార్టీ తరఫున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచిలు పెరుమాళ్, గోవిందన్, మాజీ ఉపసర్పంచు గంట్లరెడ్డి, నేతలు మునిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, బందార్లపల్లె ఆనందరెడ్డి, రఘునాథరెడ్డి, మంజునాథ్, కోదండరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మునస్వామికి టీడీపీ నేతల సన్మానం



మునస్వామిని సన్మానిస్తున్న నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరుగా నియమితులైన రామకుప్పం మాజీ జడ్పీటీసీ మునస్వామిని శనివారం పలువురు నేతలు ఘనంగా సన్మానించారు. రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన మునస్వామిని సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, సీనియర్ నేతలు రామ్మూర్తి, జయశంకర్‌లు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నేతలు గుర్రప్ప, మహేంద్రనాయుడు, మణేష్, షణ్ముగం, కేశవులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా జలాలపై అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి



మిట్టపల్లె వద్ద హంద్రీ-నీవా కాలువలో ఎమ్మార్పీఎస్ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పానికి హంద్రీ-నీవా కాలువలో కృష్ణా జలాలను తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు అపర భగీరథుడిగా నిలిచారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ తెలిపారు. శనివారం ఆయన కుప్పం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి రామకుప్పం మండలం మిట్టపల్లె వద్ద హంద్రీ-నీవా కాలువను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పానికి కృష్ణాజలాలు రావడాన్ని జీర్ణించుకోని కొందరు ప్రతిపక్ష నేతలు తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారన్నారు. ఇటువంటి చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తప్పుడు ప్రచారాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేతలు రాఘవేంద్ర, వెంకటేష్, విజయ్‌కుమార్, జయప్ప, గోవిందప్ప, పళని, రాజేష్, రమేష్, శంకర్‌గణేష్, హరికృష్ణ, మురుగేష్, గణేష్, నాగరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

నీటిశుద్ధి యంత్రం వితరణ



కంగుంది పాఠశాలలో నీటిని పట్టుకుంటున్న సునీల్‌రాజ్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని వసతి గృహాలు , పాఠశాలలకు శనివారం బీసీఎన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నీటి శుద్ధి యంత్రాలను వితరణ చేశారు. కుప్పం మండలం కంగుంది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, శాంతిపురం మండలం సాంఘిక సంక్షేమ వసతి గృహం, రామకుప్పంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు మొత్తం రూ.60 వేలు విలువ కలిగిన నీటిశుద్ధి యంత్రాలను బీసీఎన్ చారిటబుల్ ట్రస్టు తరఫున కుప్పం ఇంజనీరింగు కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్ స్వయంగా వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించడం తనకు ఓ సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా వసతి గృహాలు, పాఠశాలల వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, లయన్స్ క్లబ్ సలహాదారు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు అవసరం



రొంపిచెర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని.. రొంపిచెర్ల కేజీబీవీలో దోమలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని... నివారణ చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ అన్నారు. శనివారం ఆయన పాఠశాల గదులను పరిశీలించారు. సబ్‌యూనిట్ అధికారి విద్యాసాగర్, హెచ్‌ఈ రాజేశ్వరి, ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె :** మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు శనివారం తీర్థం పీహెచ్‌సీ డాక్టర్ పద్మావతి సీజనల్‌వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, పీహెచ్ఎన్ శమంతక, పాఠశాల ప్రిన్సిపాల్ సుమిత్ర, ఎంఎల్‌హెచ్‌పీ సాయిదివ్య, ఏఎన్ఎంలు నాగేశ్వరి, రాధాకుమారి, యమున పాల్గొన్నారు.

సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం



భూమిపూజలో పాల్గొన్న కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కుప్పం కెనాల్ ద్వారా కుప్పానికి కృష్ణాజలాలు తీసుకురావడంతో కుప్పం ప్రజలు అనాదిగా ఎదుర్కొంటున్న తాగు, సాగునీటి సమస్యలకు సీఎం చంద్రబాబు శాశ్వత పరిష్కారం చూపారన్నారు. శనివారం ఆయన ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నంతో కలిసి శాంతిపురం సమీపంలో పాలారు నదిపై చెక్‌డ్యాం మరమ్మతు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలారుపై ఉన్న 21 చెక్‌డ్యాంలకు సుమారు రూ.65 కోట్లతో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. కృష్ణాజలాలు రప్పించడంతో పాటు పాలారు నదీజలాల సంపూర్ణ వినియోగం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా దశాబ్దాల క్రితం నిర్మించిన పురాతన చెక్‌డ్యాంల మరమ్మతులకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రసుత్తం ఉన్న చెక్‌డ్యాంలతోపాటు మరిన్ని కొత్త చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజు, టీటీడీ బోర్డుమెంబర్ శాంతారాం, టీడీపీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, విజయరామిరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ నందిగం ఉదయ్‌కుమార్, ఆర్ఎస్ మణి, గోపాల్, అనసూయ, చంద్రకళ, చంద్ర, పెద్దన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ



విద్యాసామగ్రి అందిస్తున్న రాజ్యలక్ష్మి

పలమనేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మి తన కుమారుడి జ్ఞాపకార్థం బీసీ సంక్షేమ వసతి గృహంలో చదువుకొంటున్న విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ వసతిగృహం అధికారి సోమసుందరరెడ్డి, రాజ్యలక్ష్మి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఉచితంగా ఉద్యాన మొక్కల పంపిణీ

రామకుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఇన్ఫోసిస్ సంస్థ ఆర్థిక సహకారంతో కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన ప్రకృతి సేవా సంస్థ రామకుప్పం మండలంలోని రైతులకు ఉచితంగా ఉద్యాన మొక్కలు పంపిణీ చేస్తుందని సంస్థ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ ప్రశాంత్ తెలిపారు. తమ సంస్థ ద్వారా రైతులకు మామిడి, సపోటా మొక్కలు, పెంపకం కోసం ఎరువులు, పొలం గట్లలో నాటేందుకు కొబ్బరి, ఎర్రచందనం, పెద్దపనస, పెద్దవేప, మహాగని మొక్కలు అందిస్తుందని ఆయన తెలిపారు. ఆసక్తి గల రైతులు 9948169389, 9703998947 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

శాంతిపురం జూనియర్ కళాశాలలో చోరీ

రామకుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయం తాళాలను పగులగొట్టి దుండగులు లోనికి ప్రవేశించారు. అక్కడి బీరువాలోని రికార్డులను తీసుకెళ్లినట్లు కళాశాల అధ్యాపకులు రాళ్ళబూదుగూరు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో తెలిపారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

గాయపడ్డ యువకుడి మృతి

రామకుప్పం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె-బూరుగుమాకులపల్లె మధ్య కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో ఈనెల 4న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... బూరుగుమాకులపల్లెకు చెందిన శీనప్ప కుమారుడు శివశంకర్(33) ఈనెల 4న రాత్రి నిత్యావసరాల కొనుగోలు కోసం ద్విచక్రవాహనంలో చెల్దిగానిపల్లెకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కుక్క అడ్డు రావడంతో శివశంకర్ దానిని తప్పించబోయి అదుపుతప్పి శివశంకర్ కింద పడి తలపై తీవ్రగాయమైంది. కుప్పంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. శీనప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుహెడ్‌కానిస్టేబుల్ గోపి తెలిపారు.

రోగులకు అందుబాటులో వైద్యసేవలు



మందుల వివరాలపై ఆరా తీస్తున్న డీసీహెచ్ఎస్ పద్మాంజలి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రికి పేదలు వైద్యం కోసం వస్తారని, వారికి మెరుగైన వైద్య సేవలకు అందివ్వాలని డీసీహెచ్ఎస్ పద్మాంజలి సూచించారు. శనివారం పుంగనూరు ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రతి వార్డును పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

సదుం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపల్లెలో వెలసిన శ్రీవారి పాదక్షేత్రంలో స్వామి వారి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. శ్రీవారి పాదక్షేత్రం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన శ్రీవారి కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేపట్టారు. విజయభాస్కర్, పసుపులేటి వెంకటస్వామి కుటుంబ సభ్యులు కల్యాణోత్సవానికి ఉభయదారులుగా వ్యవహరించారు.

నేడు బైరెడ్డిపల్లెలో కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో 7వ తేదీన ఉదయం 9 గంటలకు మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటివైద్యశిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



రొంపిచెర్ల : ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పిల్లల తల్లిదండ్రులు



ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

రామకుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కూతేగానిపల్లెలోని పరమహంస యోగానంద విద్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయం యాజమాన్యం ఉపాధ్యాయులకు ఆటల, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ వేషధారణలతో చేసిన ఏకపాత్రాభినయాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యాలయం ప్రిన్సిపాల్ ఆజాద్‌హుస్సేన్ మాట్లాడుతూ డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను, విద్య ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

●**రొంపిచెర్ల:** రొంపిచెర్ల మండలం బైస్తపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చాన్‌బాషాను విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సత్కరించారు. ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి ఉపాధ్యాయుడు విలువైన బోధనలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బర్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సుధాకరరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ శారద, నూరేషా వెంకటేష్, రఘురామ్, రాసా ప్రతినిధి కిషోర్, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **పెద్దపంజాణి:** మండలంలోని ముత్తుకూరు, అప్పినపల్లె పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఆయా పాఠశాలలో పాఠశాల విద్యాకమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** కోటూరు ఎంపీపీ స్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామస్తులు, విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువలతో ఘనంగా సన్మానించారు. హెచ్ఎం మురళీ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ అందరికి ఆదర్శనీయుడన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రమేష్, శివకుమార్, రమణ, భాగ్యలక్ష్మీ, తేజస్విని పాల్గొన్నారు.

ఉత్తమ ఎంఈవో తిరుమలమ్మకు ఘన సన్మానం



ఎంఈవో తిరుమలమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చౌడేపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఎంఈవోగా అవార్డు పొందిన ఎంఈవో-2 తిరుమలమ్మను శనివారం స్థానిక ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అవార్డు పొందిన ఎంఈవో తిరుమలమ్మ, ఉపాధ్యాయుడు రమేష్‌లను ఎంఈవో కేశవరెడ్డి, ఉపాధ్యాయులు స్థానిక ఎంఆర్‌సీలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగమూర్తి, సహదేవ, వసంత, ప్రకాష్, పుష్పలత, సుబ్రహ్మణ్యం, సుధాకర్‌నాయుడు, జగన్మోహన్‌రెడ్డి, బాబురమేష్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

9న విజయవాడ సభను విజయవంతం చేయాలి



సమావేశమైన కాంట్రాక్ట్ ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఈనెల 9న విజయవాడలో జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ట్రాన్స్‌కో అధ్యక్షుడు అంబికేష్, ఎస్‌పీడీసీఎల్ అధ్యక్షుడు గంగాధర్ కోరారు. శనివారం స్థానిక ఓ మండపలో జరిగిన ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాల్సిన పీఆర్సీ-22 అరియర్స్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ట్రాన్స్‌కో, ఎస్‌పీడీసీఎల్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ దామోదర్‌రాజు

చౌడేపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధికారులు.. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మండలాభివృద్ధి సాధ్యమని జడ్పీటీసీ దామోదర్‌రాజు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం బదిలీలపై వచ్చిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలన్నారు. వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీటి కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దోమలు అధికమై ప్రజలు ఇబ్బందులు పడటం గుర్తించామన్నారు. ప్రభుత్వ నిధులను ప్రజలకు, గ్రామాల్లో అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. ఎంపీడీవో లీలామాధవి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంఈవో కేశవరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు గంబూసియా చేపలు



కీలపల్లె చెరువులో చేపపిల్లలను వదులుతున్న అధికారులు



చెరువులో చేపలు వదులుతున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తదితరులు

పలమనేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లో నీరు చేరడంతో దోమలు అధికం కావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటి వరకు ప్రతి శుక్రవారం డ్రైడే పేరుతో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. అయితే దోమల లార్వాలను తిని దోమలు వృద్ధి కాకుండా చేసే గంబూసియా చేపలను అధికారులు తెప్పించి చెరువులు, చిన్నచిన్న నీటి కుంటల్లో వదిలిపెడుతున్నారు. శనివారం జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, పలమనేరు సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ పలమనేరు మున్సిపాలిటి నీళ్లకుంట, బొమ్మిదొడ్డి చెరువుల్లో గంబోషియా చేపలను వదిలిపెట్టారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

●**వి.కోట:** జ్వరాల నియంత్రణ చర్యల్లో భాగంగా దోమలను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఓగు వైద్యాధికారిణి సుష్మిత అన్నారు. జీవ నియంత్రణ చర్యలో భాగంగా దోమల లార్వాలను లేకుండా చేసేందుకు గంబూసియా చేప పిల్లలను వి.కోట కీలపల్లె చెరువు, అబ్దుల్ కలాం వీధిలోని గంగమ్మఏరు, పాపేపల్లె దారిలోని బావిలో వదిలారు. ఒక్కో చేప రోజుకు 100 నుంచి 300 దోమల లార్వాలను తింటాయన్నారు. ఐదేళ్ల వరకు ఈ చేపల జీవిత కాలం ఉంటుందన్నారు. చేపల కారణంగా దోమల వ్యాప్తి తగ్గి వాటిని కొంత వరకు నివారించవచ్చన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు రెడ్డి, సిబ్బంది నాగరత్న, బాబు, శ్రీహరి, అశ్విని, కీర్తి, ఏఎన్ఎం జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థినులకు నీతిపద్యాల పుస్తకాల పంపిణీ



నీతిపద్యాల పుస్తకాలందుకున్న విద్యార్థులతో ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాల, ఆదర్శపాఠశాల, కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు శనివారం పలమనేరు తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నీతిపద్యాలు, పెద్దబాలశిక్ష, జ్ఞానదీపాలు తదితర పుస్తకాలను బైరెడ్డిపల్లె ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసినాథంనాయుడు, పుష్ప ఇప్పటివరకు 2 లక్షలకు పైగా పుస్తకాలను విద్యార్థులకు అందజేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠను విజయవంతం చేయండి

పుంగనూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 5న తిరుపతిలో జరగబోవు కనకదాసు విగ్రహ ప్రతిష్ఠను విజయవంతం చేయాలని పుంగనూరు కురబసంఘ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పుంగనూరులో కురబసంఘ నాయకులు కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లోని కురబకులస్తులు అధికసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘనాయకులు హేమంత్‌కుమార్, గోపాల్, ఆదినారాయణ, యశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.

దాడి చేసి సెల్‌ఫోన్, నగదు దోపిడీ

పలమనేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పాతపేటకు చెందిన రఫీ అనే వ్యక్తి ఇంటికి వెళ్తుండగా నలుగురు యువకులు ఒక్కసారిగా అతడిపై దాడిచేసి సెల్‌ఫోన్‌ను, రూ.5 వేలు నగదు దోపిడీ చేసుకెళ్లారు. దాడిలో తలకు తీవ్ర గాయం కావడంతో రఫీని కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించారు. దాడికి పాల్పడిన యువకుల్లో పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బహుజన పార్టీ పలమనేరు ఇన్‌చార్జిగా శ్రీనివాసులు

పలమనేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పలమనేరు బహుజన పార్టీ ఇన్‌చార్జిగా పలమనేరు మండలం పందివారిపల్లె గ్రామానికి చెందిన కె.శ్రీనివాసులు నియమితులయ్యారు. శ్రీనివాసులు బహుజన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రబాబు సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాసులునుపలమనేరు ఇన్‌చార్జిగా నియమించారు. కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు శివాడి గోవిందు పాల్గొన్నారు.

నేత్ర దానం మహోన్నతం



నేత్రదానంపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆరగ్యో సిబ్బంది

సదుం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లోకల్లా నేత్ర దానం మహోన్నతమైందని సదుం సీహెచ్‌సీ వైద్యాధికారి హరిప్రసాద్ రాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక సీహెచ్‌సీలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఆరోగ్య, సంక్షేమ శాఖ సిబ్బంది కంటి జాగ్రత్తలపై అవగాహనతోపాటు నేత్రదానం ప్రయోజనం, ఆవశ్యకత, తదితర అంశాలపై రోగులు, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్డీపీఐ సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్డీపీఐ నాయకులు

పుంగనూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పుంగనూరులో అన్ని వార్డుల్లో ఎస్డీపీఐ గెలిచేందుకు ప్రతి ఒక్కరూ సైనికులా పని చేయాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి యూనుస్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్డీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలోని వార్డులు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధం కావాల్సి ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సిద్దిక్, ఆసిఫ్, షామీర్, ఖాదర్‌బాషా, అబ్దుల్‌కలందర్, సర్దార్, నౌషాద్, రషీద్‌బాయ్, అతిక్‌బాషా, తౌసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

తుర్లపల్లె ఈఆర్వోకు పదోన్నతి

పెద్దపంజాణి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుర్లపల్లె పంచాయతీలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం ఆచారి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాడని స్థానిక తహసీల్దారు హనుమంతు పేర్కొన్నారు. పదోన్నతిపై పలమనేరు రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి బదిలీ అయ్యారని ఆయన తెలిపారు.

దిశా నిర్దేశకులు ఉపాధ్యాయులు: ఎమ్మెల్యే భానుప్రకాష్



సన్మానం అందుకున్న టీచర్లతో ఎమ్మెల్యే భానుప్రకాష్

నిండ్ర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు దిశా నిర్దేశకులు ఉపాధ్యాయులు అని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం నగరిలో జరిగిన గురుపూజోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన తండ్రి ముద్దుకృష్ణమనాయుడు కూడా ఉపాధ్యాయుడిగానే జీవితాన్ని ప్రారంభించి, రాజకీయాల్లో వచ్చారని గుర్తుచేశారు. అనంతరం జిల్లా, మండలస్థాయిలో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను సన్మానించారు. మండల విద్యాశాఖ అధికారులు శ్రీదేవి, ఓం నమఃశివాయ, నగరి పీఏసీఎస్ చైర్మన్ బాలాజి, మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, రూరల్ టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, కార్యదర్శి వేణు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



పాలసముద్రం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారాన్ని అందుకున్న తిరుమలరాజుపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆనందయ్య శనివారం ఆ బడిలోని టీచర్లు సన్మానించారు. అలాగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం మురళీకృష్ణమ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురుగదాస్, శ్రీహరి, కేశవులు, పుష్పలత పాల్గొన్నారు.

పీటీసీని పరిశీలించిన ఎస్పీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారికి త్వరలోనే శిక్షణ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ (పీటీసీ)ని శనివారం ఎస్పీ మణికంఠ పరిశీలించారు. ఒకేసారి వంద మంది భోజనం చేయగల సదుపాయం ఉందో లేదో ఆరా తీశారు. పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని సూచించారు. వైద్య బృందంతోపాటు అంబులెన్స్‌లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎస్పీతో పాటు ఎంటీవో చంద్రశేఖర్, డీటీసీ సిబ్బంది ఉన్నారు.

పౌర్ణమి గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరింపేటలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేక రథం అధిష్ఠింపజేసి గిరి ప్రదక్షిణ నిర్వహించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



విజయపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల విద్యావనరుల కార్యాలయంలో ఉపాధ్యాయులను శనివారం సన్మానించారు. తహసీల్దార్ కిరణ్, ఉద్యోగ విరమణ పొందిన ఎంఈవో ఆంజనేయులు, ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



నిండ్ర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ఎం.భాస్కర్‌రాజును సత్కరించారు. శనివారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలకపాత్ర

నిండ్ర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలకపాత్ర అని ఎంపీపీ దీప అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, డిప్యూటీ తహసీల్దార్ మాధవి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఎం పళణి, ఏపీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటండి

పెనుమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విరివిగా మొక్కలు నాటాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం విడిదిపల్లెలో ఉపాధి హామీ శ్రామికులతో కలిసి మొక్కలునాటారు. ఏపీవో గుణశేఖర్, టీఏ రాఘవేంద్ర పాల్గొన్నారు.

175 మందికి వైద్యపరీక్షలు

నిండ్ర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని గుండ్రాజుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో 175 మందికి రక్త, షుగర్ పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. తిరుపతి మాధురి రెమిడి ఆస్పత్రి, వాసన్‌ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు, నిర్వాహకులు కోనేటి రవిరాజు,బాలసుబ్రహ్మణ్యంరాజు, రామ్మోహన్‌వర్మ, సర్పంచ్ బాల ప్రసాద్‌రెడ్డి, చిన్నబ్బరాజు, జయపాల్ పాల్గొన్నారు.

వైభవంగా 'నిమజ్జనం'



చిత్తూరులోని 75 దొడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన 40 అడుగుల భారీ వినాయక ప్రతిమను ఉత్సవ మండపంలోనే శనివారం వైభవంగా నిమజ్జనం చేశారు. పాలతో అభిషేకం చేశాక వాటర్ పైపుల సాయంతో నిమజ్జనం చేశారు.
- చిత్తూరు కల్చరల్, ఆంధ్రజ్యోతి





కాణిపాకంలో జరుగుతున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఉత్సవర్లను తీసుకొస్తున్న ఈవో పెంచలకిషోర్, ఉభయదారులు- సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటికలో ఓ సన్నివేశం

గణేష్ ఇరుముడుల సమర్పణ



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో శనివారం కాకినాడ జిల్లా తునికి చెందిన 30 మంది భక్తులు గణేష్ ఇరుముడులను సమర్పించారు. వీరికి ఆలయ అధికారులు స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులు దీక్షా విరమణ మండపంలో ఇరుముడులను సమర్పించారు. కాగా, స్వామివారిని అడిషినల్ ఐజీ శ్రీకాంత్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఆధ్వర్యంలోని గోసంరక్షణ ట్రస్టుకు తిరుపతికి చెందిన విజయదీపిక రూ.1,11,116లను విరాళమిచ్చారు.

పీహెచ్‌సీల ఏర్పాటుపై పరిశీలన

వెదురుకుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలోని తిరుమలయ్యపల్లె, దేవళంపేటల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు విషయమై డీఎంహెచ్‌వో సుధారాణి శనివారం దేవళంపేటకు వచ్చారు. పీహెచ్‌సీని దేవళంపేటకు తప్పనిసరిగా మంజూరు చేయాలని టీడీపీ నాయకులు గుణశేఖర్, సతీష్‌నాయుడు, పయని, ఎస్సీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి శేషాద్రికుమార్ కోరారు.అనంతరం ఆమెను శాలువా కప్పి సత్కరించారు. కాగా పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడాక ఆరోగ్య సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అన్ని రకాల యాప్స్‌ను వందశాతం అప్డేట్ చేయాలని ఆదేశించారు.





పచ్చికాపల్లం పీహెచ్‌సీలో రోగిని పరిశీలిస్తున్న సుధారాణి - డీఎంహెచ్‌వోని సన్మానించిన టీడీపీ నాయకులు

'బృందావన్'లో టీచర్స్ డే



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బృందావన్ సీనియర్ సెకండరీ పాఠశాలలో టీచర్స్ డేని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల గౌరవాధ్యక్షుడు విజయభాస్కర్, ప్రిన్సిపాల్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యశాఖ మంత్రిని కలిసిన రావూరి వెంకటస్వామి



చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను శనివారం శ్రీవెంకటేశ్వర విద్యవైద్యసంస్థల చైర్మన్ రావూరి వెంకటస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని తాజ్ హోటల్‌లో ఉన్న మంత్రిని కలిసి చిత్తూరులోని ఆర్వీఎస్ ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలను తెలియజేశారు. త్వరలోనే ఆస్పత్రిని సందర్శిస్తానని మంత్రి చెప్పినట్లు రావూరు తెలిపారు.

ఆ వైసీపీ నేతలపై చర్యలు తీసుకోండి: బీజేపీ

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భక్తుల మనోభావాలను కించపరిచేలా వ్యవహరించిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ వినాయక మండపాలు, పరిసర ప్రాంతాల్లో మాంసాహార భోజనాన్ని భక్తులకు వడ్డించిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ టీచర్‌కు సత్కారం



గుడిపాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ టీచర్ పురస్కారం అందుకున్న నరహరిపేట జడ్పీ హైస్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు నైషాద్ అలీని శనివారం సత్కరించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

'భారత్‌పై అమెరికా పెత్తనం మానుకోవాలి'

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత్‌పై అమెరికా పెత్తనం మానుకోవాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అమెరికాకు భారత్ ఎగుమతి చేసే ఉత్పత్తులపై 50 శాతం సుంకాలను విధిస్తామంటూ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై శనివారం గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ట్రంప్ నిర్ణయంతో ఆక్వా, టెక్స్‌టైల్స్ ఉత్పత్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, గంగరాజు, మణి, రఘు, సురేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌కు పలువురి శుభాకాంక్షలు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సోదరుడు జీవన్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు జీవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గాంధీవిగ్రహం వద్ద కేక్ కట్‌చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు పండ్లు పంచారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమారెడ్డి, నేతలు సురేంద్రకుమార్, త్యాగరాజన్, వెంకటేష్ యాదవ్, కోదండయాదవ్, మోహన్‌రాజ్, గోపాల్, మేషాక్, శశికర్‌బాబు, రఘు, కందస్వామి, శామ్, కంద, వినోద్ కుమార్, నాగలక్ష్మి, సబిత పాల్గొన్నారు.

'సీసీ రోడ్ల' వివాదంపై సర్వే



సర్వేకొచ్చిన ఉద్యోగులతో కిషన్ చంద్, స్థానికులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెట్టు గుంటపల్లెలో 'సీసీ రోడ్ల' వివాదంపై కోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఇందులో భాగంగా శనివారం కోర్టు నియమించిన కమిషనర్ బాలాజి, జిల్లా సర్వేయర్ మహమ్మద్ బాష, మండల సర్వేయర్ భానుమతి, గ్రామ సర్వేయర్ గుణశేఖర్‌రెడ్డి, వీఆర్వో భీమయ్య, పంచాయతీరాజ్‌శాఖ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి గ్రామానికొచ్చి సర్వే నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే థామస్ సహకారంతో చొరవతో సీసీ రోడ్ల పనులు జరుగుతుంటే ఆటంకం కల్పించాలనే వ్యాజ్యం దాఖలు చేశారని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ ఆరోపించారు.

టీచర్లకు సన్మానం



యాదమరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మాదిరెడ్డిపల్లి పాఠశాల ఉపాధ్యాయులు రెహానా బేగం, మీనాక్షితోపాటు మండలంలోని టీచర్లను ఎంపీడీవో వేణు, తెలుగు యువత అధికార జిల్లా ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు శనివారం సత్కరించారు. ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, టీచర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

వెదురుకుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై కార్వేటినగరం ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ శకుంతల, మహిళా సంరక్ష కార్యదర్శి హైమావతి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఐసీడీఎస్ ప్రాజెక్టు కోశాధికారి ఎస్.లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలివ్వండి: ఏఐటీయూసీ

విజయపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్లకు పెండిగ్‌లోని 18 నెలల వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో రాజేంద్రకు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య, మండల అధ్యక్షుడు రవి, నాయకులు ఏసుపాదం, ముత్తు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీలు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆరిమాకులపల్లె పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో సుధారాణి శనివారం తనిఖీలు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి బాలాజి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

బంగారుపాళ్యం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేఎం కండ్రిగలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరారు. నెల రోజులుగా అగచాట్లు తప్పడం లేదన్నారు. పొలాల నుంచి నీరు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కొళాయిల్లో నామమాత్రంగా నీరు వస్తుండటంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వాపోయారు. ఇకనైనా తమ సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బంగారుపాళ్యం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎన్‌పీసీ నాయుడు కాలనీ, శాంతినగర్, ప్రభుత్వ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దేవీప్రసన్న తెలిపారు. ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వినాయకస్వామికి పూజలు



పాలసముద్రం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆముదాల పంచాయతీ కొత్తకండ్రిగలో బెంగళూరు నుంచి వచ్చిన యువత శనివారం గణేశ ప్రతిమకు పూజలు చేశారు.

టీడీపీ నేతకు నివాళి

విజయపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్షూరికాపురంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రాజు కర్మక్రియల సందర్భంగా శనివారం ఆయన చిత్రపటం వద్ద ఎమ్మెల్యే భానుప్రకాష్ నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు చుక్కా ధనుంజయయాదవ్, బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, బాబుయాదవ్, గజేంద్రనాయుడు, శ్యాంసుందర్, కుమారస్వామిరాజు, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ క్వారీలో తనిఖీలు

పాలసముద్రం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సరిహద్దులోని వనదుర్గాపురం వద్ద ఉన్న గ్రావెల్ క్వారీని శనివారం రెవెన్యూ సిబ్బందితో కలిసి డీటీ రిషివర్మ శనివారం తనిఖీలు చేశారు. అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆర్ఐదేవి, వీఆర్వోలు రమేష్ నాయుడు, వెంకటాచలం పాల్గొన్నారు.

ఆట వస్తువుల వితరణ

గుడిపాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సోదరుడు జీవన్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల్లోని విద్యార్థులకు శనివారం ఆటవస్తువులు, పాఠ్యపుస్తకాలను వితరణ చేశారు. టీడీపీ నేతలు గురజాల చెన్నకేశవ నాయుడు, బాలాజి నాయుడు, అనిల్ కుమార్, శరత్, మురళి సుమతి, బాల సుబ్రమణ్యం యాదవ్, రాజేష్, చల్లా, రాజ్‌కుమార్, నిత్యానందం, రెడ్డెప్ప, పీటర్ పాల్గొన్నారు.

'పనిభారం తగ్గించండి'

వెదురుకుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ చేత ప్రభుత్వం చేయిస్తున్న సర్వేలను సంబంధిత శాఖలకే అప్పగించి తమకు పనిభారం తగ్గించాలని వెదురుకుప్పం మండల సచివాలయ ఉద్యోగులు శనివారం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఒకే శాఖ కింద పనిచేసేలా ఆదేశాలివ్వాలన్నారు. తమకు రావాల్సిన ఇంక్రిమెంట్లను త్వరగా ఇప్పించాలన్నారు.

గరుడ వాహన తయారీకి టీటీడీ సానుకూలం

కరియమాణిక్యస్వామి ఆలయ అభివృద్ధి సలహా కమిటీ సభ్యులు

నిండ్ర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరిలోని కరియమాణిక్య స్వామికి దాతల సహకారంతో గరుడ వాహనం తయారు చేయడానికి టీటీడీ సానుకూలంగా స్పందించిందని ఆలయ అభివృద్ధి సలహా కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ సిఫారసుతో వాహన తయారీ అంశంపై శనివారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని కలిశామన్నారు. ఆయన వెంటనే తగిన చర్యల నిమిత్తం జేఈవోకు ఆదేశాలు జారీచేశారని వివరించారు. త్వరలోనే పంచలోహ గరుడ వాహనం సిద్ధమవుతుందన్నారు. దీంతో ఆలయానికి గరుడ వాహనం లేదన్న కొరత తీరనుందని సభ్యులు జ్యోతినాయుడు, ఆనం సురేష్ నాయుడు, జి.రాజశేఖర్, ఎన్‌సి శేఖర్, మనోహర్‌నాయుడు తదితరులు పేర్కొన్నారు.

గంగజాతర నిర్వహణపై డీఎస్పీ సమీక్ష

నిండ్ర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్, రూరల్‌లో జరగనున్న గంగజాతరపై శనివారం నిర్వాహకులతో నగరి పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ అజీజ్ సమీక్షించారు. సీఐ విక్రమ్ పాల్గొన్నారు.

రీసర్వేపై గ్రామసభలు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహదేవమంగళం, ముక్కళత్తూరు గ్రామాల్లో రీసర్వేపై గ్రామసభలు శనివారం నిర్వహించారు. మండల సర్వేయర్ గణేష్, రీసర్వే డీటీ శోభారాణి, పెనుమూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేలు మొదలి, రైతులు పాల్గొన్నారు.

'వినాయక' నిమజ్జనోత్సవం

వెదురుకుప్పం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వినాయకుడి ప్రతిమ నిమజ్జనోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందుగా పూజ లు చేసి, భక్తులకు అన్నదానం చేశారు.

భక్తులకు అన్నదానం

గుడిపాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 197 రామాపురంలో శనివారం వినాయక ప్రతిమ నిమజ్జనం శనివారం వేడుకగా జరిగింది. స్థానికులు వరదరాజులు, లోకేష్ కుటుంబీకులు భక్తులకు అన్నదానం చేశారు.